నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శనివారం 13 జనవరి 2024 | HYDERABAD

సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని చిత్రంలో చూడొచ్చు.

నుమాయిష్‌లో నగరవాసులు సందడి చేస్తున్నారు. నచ్చిన వాటిని కొనుగోలు చేస్తున్నారు. చిత్రంలో ట్రాఫిక్ పోలీసుల స్టాల్‌లో చిన్నారికి అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది.

హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ శ్రీనివాస్‌రెడ్డి

ఆధార్ లేదు..
కేసు నమోదు చేయం

కుటుంబసభ్యులను తిప్పి పంపిన హబీబ్‌నగర్ పోలీసులు

అదృశ్యమైన యువతి.. మొయినాబాద్‌లో అనుమానాస్పద మృతి

పోలీసుల నిర్లక్ష్యంపై హైదరాబాద్ సీపీ ఆగ్రహం

ఎస్సై సస్పెండ్.. ఎస్‌హెచ్‌వోకు మెమో

సిటీబ్యూరో/మెహిదీపట్నం, జనవరి 12 (నమస్తే తెలంగాణ): హిట్ అండ్ రన్‌లో చాదర్‌ఘాట్ పోలీసుల నిర్లక్ష్యం మరువకముందే.. మరోసారి పోలీసుల నిర్లక్ష్యం బయటపడింది. ఆధార్ లేకుంటే.. కేసు నమోదు చేయమంటూ.. అదృశ్యమైన యువతి కుటుంబసభ్యులను తిప్పి పంపించారు. కనిపించకుండాపోయిన ఆ యువతి మొయినాబాద్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. హబీబ్‌నగర్ పోలీసుల నిర్లక్ష్యం బయట పడటంతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా ఠాణాకు వెళ్లి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి కారకుడైన ఎస్సైని సస్పెండ్ చేస్తూ, ఠాణా ఎస్‌హెచ్‌వోకు సీపీ మెమో జారీ చేశారు. అయితే, 10 రోజుల కిందట చాదర్‌ఘాట్‌లో ఇలాంటి ఉదంతం వెలుగులోకి వచ్చింది. చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి ..హిట్ అండ్ రన్‌లో చనిపోయింది..ఒక్కరే నని గుర్తించడంలో చాదర్‌ఘాట్ పోలీసులు నిర్లక్ష్యం వహించారు. కుటుంబసభ్యులే దవాఖానకు వెళ్లి మృతుడిని గుర్తించారు.

తాజా ఘటనలో అసలేం జరిగింది..

మల్లేపల్లి గోకుల్ నగర్ మొఘల్ గ్రౌండ్ సమీపంలో నివసించే తహసీన్ బేగం(22) బీకామ్ రెండో సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 8న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. అదే రోజు రాత్రి కుటుంబసభ్యులు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వయస్సులో మిస్సింగ్ అంటే ఏమిటో అందరికీ తెలుసు...ఫొటో ఏదీ..? ఆధార్ కార్డు ఏదీ..మీరు ఈ ప్రాంతంలో ఉంటారని గ్యారెంటీ ఏమిటీ... ? ముందు వెళ్లి ఆ అమ్మాయి ఆధార్‌కార్డు, మీ ఆధార్ కార్డు పట్టుకొని రావాలం'టూ.. సెక్టార్ ఎస్సై శివ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. 10న మరోసారి కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా... తుతూ మంత్రంగా వివరాలు తీసుకొని చూస్తామంటూ పంపించేశారు. కేసు మాత్రం నమోదు చేయలేదు. ఈ క్రమంలోనే మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాకారం వద్ద ఈనెల 8న అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని యువతి మృతి చెందింది. సైబరాబాద్ పోలీసులు ఆ యువతి ఆచూకీ కోసం వివిధ ఠాణాల్లో అదృశ్యమైన కేసులను తెలుసుకున్నారు. వివిధ కోణాల్లో ఆధారాలను విశ్లేషించిన సైబరాబాద్ పోలీసులు.. ఆ మృతురాలు మల్లేపల్లికి చెందిన యువతిగా గుర్తించారు.

నిర్లక్ష్యంపై ఆగ్రహం..

సీపీ శ్రీనివాస్‌రెడ్డి హబీబ్‌నగర్ ఠాణాకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఆధార్ లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలుసుకున్న సీపీ.. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సై శివను సస్పెండ్ చేస్తూ.. ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు మెమో జారీ చేశారు.

హత్యా.. ఆత్మహత్యా?



మొయినాబాద్ యువతి మృతి కేసులో ప్రశ్నలెన్నో

ఎట్టకేలకు మృతురాలిని గుర్తించిన పోలీసులు

అనుమానాలకు తావిస్తున్న పోలీసుల భిన్న ప్రకటనలు

మానసిక ఒత్తిడితోనే బలవన్మరణం: పోలీసులు

కలకలం రేపిన మొయినాబాద్ యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. మృతురాలు పాతబస్తీకి చెందిన యువతిగా గుర్తించారు. ఆమెది హత్య కాదు..ఆత్మహత్యగా తేల్చారు. ఈనెల 8న మొయినాబాద్, బాకారం గ్రామం, డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం కాలిపోతున్నట్లు 100 నంబర్‌కు కాల్ వచ్చింది. పోలీసులు అక్కడికి చేరుకునే సరికే మృతదేహం పూర్తిగా కాలిపోయింది. ఘటనా స్థలిలో సిమ్ లేని సెల్‌ఫోన్ కనిపించింది. క్లూస్‌టీమ్, జాగిలాలతో పరిసరాల్లో ఆధారాలను సేకరించారు. తొలుత ఆ యువతిని ఎవరో హత్యచేసి కాల్చివేసినట్లు అనుమానించిన పోలీసులు.. మృతురాలిని గుర్తించే క్రమంలో దర్యాప్తు ప్రారంభించారు. మొయినాబాద్ పోలీసులతో పాటు రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాలు, టవర్ లోకేషన్, మొబైల్ సాయంతో పాటు 200 మిస్సింగ్ కేసులను విశ్లేషించి మిస్టరీని ఛేదించారు.

- సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ):

పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 8న మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల సమయంలో ఒక ఆటో యెంకపల్లి నుంచి బాకారం వైపు వెళ్లినట్లు నీసీ కెమెరాలో రికార్డు అయింది. ఆ ఫుటేజీ ఆధారంగా ఆటో డ్రైవర్‌ను రాజేంద్రనగర్‌కు చెందిన సయీద్ వాసిమ్‌గా గుర్తించారు. అతడిని విచారించగా ఆ రోజు ఉదయం 11.30 గంటల సమయంలో ఓ యువతి మల్లేపల్లిలో తన ఆటో ఎక్కిందని, డ్రీమ్ వ్యాలీకి వెళ్లాలని రూ.1100కు మాట్లాడినట్లు వెల్లడించాడు. తొలుత మురాద్‌నగర్‌లోని తన స్నేహితుల ఇంటికి వెళ్లాక.. హుమాయున్‌నగర్‌లోని రాయల్ కాలనీలో ఉన్న మరో స్నేహితురాలి ఇంటికి వెళ్లిందన్నాడు. 15 నిమిషాల తరువాత వచ్చిన యువతి ఐదు లీటర్ల డబ్బా ఉన్న బ్యాగ్‌తో వచ్చి, తిరిగి ఆటోలో ఎక్కి మొయినాబాద్ డ్రీమ్ వ్యాలీ వెళ్లినట్లు వెల్లడించారు. అక్కడ ఓ ఫామ్‌హౌస్ వద్ద ఆటో దిగిన ఆ యువతి.. తనకు ఆటో చార్జ్ రూ.1100 ఇచ్చినట్లు డ్రైవర్ తమ విచారణలో వెల్లడించాడని పోలీసులు తెలిపారు. ఆ తరువాత మధ్యాహ్నం 1.53 గంటల సమయంలో తన స్నేహితుడైన రాహిల్‌కు ఫోన్ చేసి, ఆ తరువాత తన మొబైల్‌ను స్విచ్ఛాఫ్ చేసినట్లు దర్యాప్తులో నిర్ధారించారు. ఈ ఫోన్ కాల్ ఆధారంగా రాహిల్‌ను విచారించగా సదరు యువతి పాతబస్తీలోని మల్లేపల్లికి చెందిన తహసీన్ బేగంగా గుర్తించినట్లు తెలిపారు. తహసీన్ బేగం తన క్లాస్ మేట్ ఒక స్నేహితురాలితో చాలా సన్నిహితంగా ఉండేది. ఈ క్రమంలో ఇటీవల ఇరువురి మధ్య తలెత్తిన మనస్పర్థలతో కొన్ని రోజులుగా ఇరువురు దూరంగా ఉంటున్నారని, అంతేకాకుండా వీరి సన్నిహిత్యంపై కుటుంబసభ్యులు అభ్యంతరం చెప్పడంతో తహసీన్ బేగం డిప్రెషన్‌కు గురై.. గతంలో ఓ సారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వివరించారు. ఈ క్రమంలోనే మానసిక ఒత్తిడికి లోనైన తహసీన్ బేగం తన స్నేహితురాలి ఎడబాటును తట్టుకోలేక ఆత్మహుతికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ ప్రశ్నలకు బదులేది

- ఘటనా స్థలిలో యువతి మృతదేహాన్ని పరిశీలించిన మొయినాబాద్ పోలీసులు.. ఎక్కడో హత్య చేసి..ఇక్కడకు తీసుకొచ్చి.. పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఉందని, ఇది ముమ్మాటికీ హత్యే నని జనవరి 8న వెల్లడించారు.
- మృతురాలు హబీబ్‌నగర్‌కు చెందిన యువతిగా గుర్తించి, ఆమెది అనుమానాస్పద మృతి అయిన, జరిగిన పరిణామాలతో ఆత్మహత్యగా భావిస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక తరువాత అసలు విషయం వెలుగులోకి వస్తుందంటూ సైబరాబాద్ పోలీసులు ఆ తర్వాత ప్రకటించారు.
- ఘటన జరిగిన రోజు, మృతురాలు గుర్తించిన తర్వాత రెండు వేర్వేరు వాదనలు పోలీసులు వెల్లడించడం వెనుక కారణాలేమిటి అనే విషయాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి.
- ఆత్మహత్య అయితే ఘటన స్థలంలో మృతురాలు మంటల్లో కాలుతూ.. అటు ఇటూ కదిలిన అనవాళ్లు ఉండాలి. సెల్‌ఫోన్‌లో సిమ్‌కార్డు ఎందుకు తీస్తుందనే సందేహాలు వస్తున్నాయి.
- శరీరంతో పాటు దుస్తులు కూడా పూర్తి కాలిపోయాయని, జీన్స్ పాయింట్‌కు ఉండే పాచ్ మాత్రమే దొరికిందని..ఆ యువతి జీన్స్ వేసుకుని ఉండవచ్చని లేదా ఏదైనా హ్యాండ్ బ్యాగ్ ఉండవచ్చని ఘటన జరిగిన రోజు పోలీసులు తెలిపారు. ఇది మినహా మిగిలిన ఆధారాలేవీ లేవని స్పష్టం చేశారు. ఎఫ్‌ఐఆర్‌లో ఓ ప్రత్యక్ష సాక్షి తనకు అక్కడ అగ్గిపెట్టె కనిపించిందని చెప్పారు. కానీ ఇప్పుడు పోలీసులు పెట్రోలు క్యాన్ కూడా ఉందని చెబుతున్నారు.
- ఘటన జరిగిన రోజు కాలిన మృతదేహం దగ్గర కేవలం ఫోన్ మాత్రమే దొరికిందని, అందులో సిమ్‌లేదని పోలీసులు చెప్పారు. కానీ శుక్రవారం మాత్రం ఫోన్‌నంబర్ ఆధారంగా ఆమెను గుర్తించినట్లు చెప్పారు. ఇలా పలు అంశాల్లో అస్పష్టత ఉండటంతో ఇది హత్యనా? ఆత్మహత్యనా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం మృతురాలిని పాతనగరానికి చెందిన యువతిగా గుర్తించిన పోలీసులు ఆమెది హత్యకాదు, ఆత్మహత్యగా తేల్చేశారు.

నమస్తే ఎఫెక్ట్

లిఖిల్‌కు వైద్యం

శేరిలింగంపల్లి, జనవరి 12: శేరిలింగంపల్లి డొయాన్స్ కాలనీలో కుక్కల దాడిలో గాయపడిన బాలుడు లిఖిల్‌కుమార్‌ను వెటర్నరీ అధికారులు శుక్రవారం పరామర్శించారు. గురువారం 'నమస్తే'లో 'పీక్కుతింటున్నాయి' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు.. బాలుడి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. శేరిలింగంపల్లి వెటర్నరీ డాక్టర్ బాసిత్ లిఖిల్‌కుమార్‌కు హిమోగ్లోబిన్, రేబిస్ ఇంజెక్షన్ వేయించి.. అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే కాలనీలో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకున్న సిబ్బంది.. కేపీహెచ్‌బీకాలనీలోని జంతు సంరక్షణ ప్రత్యేక కేంద్రానికి తరలించారు.

ఆ లైట్లతోనే మంటలు

సీఎంఆర్, అంకురకు నోటీసులు

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): వ్యాపార సంస్థలు తమ ప్రచారం కోసం ఏర్పాటు చేసే జిగేల్‌మనే లైట్లతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సీరిస్ లైట్లు ఏర్పాటు చేసేటప్పుడు తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, ఆ నిబంధన ఇటీవల అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న అంకుర ఆస్పత్రి, ఉప్పల్‌లోని సీఎంఆర్ మాల్ సంస్థలు పాటించలేదని, ఆ రెండు సంస్థలకు నోటీసులు జారీ చేశామని శ్రీనివాసరావు తెలిపారు.

భార్యతో వీడియో కాల్ మాట్లాడుతూ..

వెంగళరావునగర్, జనవరి 12: వీడియో కాల్ ఓ భవన నిర్మాణ కార్మికుడి ప్రాణాన్ని తీసింది. మధురానగర్ ఎస్సై సాయినాథ్ రెడ్డి కథనం మేరకు.. యూపీ చెందిన సతీశ్(25) సారథి స్టూడియో సమీపంలోని ఓ కళాశాల భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం భార్యతో వీడియో కాల్‌లో మాట్లాడుకుంటూ.. ఐదో అంతస్తు పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయాడు.

ఇంజినీర్ కక్కుర్తి
బల్దియా టైర్లు ప్రైవేటుకు..

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ ఫలక్‌నుమా సర్కిల్‌లో ఓ ఇంజినీర్ అవకతవకలకు పాల్పడుతున్నారంటూ.. బుద్ధభవన్‌లోని చీఫ్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ (సీటీవో)కు సివిల్ కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేశారు. అలాగే ట్రాన్స్‌పోర్ట విభాగానికి సంబంధించి వాహనాల కొత్త టైర్లు ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల కోసం అమ్ముకుంటున్నారని పేర్కొంటూ.. సివిల్ కాంట్రాక్టర్ సాయి కిరణ్ బల్దియా కమిషనర్ చాంబర్‌లో, ఈఎన్సీకి ఫిర్యాదు లేఖను అందించారు. గతంలో సదరు ఇంజినీర్ రాజేంద్రనగర్ పనిచేసిన సమయంలోనూ అవినీతికి పాల్పడ్డారని, విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని సాయికిరణ్ కోరారు. ఈ క్రమంలో ట్రాన్స్‌పోర్ట్ ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు.

• సకినాలు రెడీ

బతుకమ్మకుంటలో సంక్రాంతి పండుగ సందర్భంగా సకినాలు తయారు చేస్తున్న మహిళలు

సమష్టి కృషితోనే అవార్డులు

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): అధికారులు, కార్మికుల కృషి, ప్రజల సహకారంతో జీహెచ్‌ఎంసీకి అవార్డులు లభించాయని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్-2023'లో నగరానికి ఐదు అవార్డులు వచ్చాయి. ఈ నెల 11న న్యూఢిల్లీలో బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్ కేంద్ర మున్సిపల్ పట్టణ అభివృద్ధి మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ నుంచి అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి అవార్డులు అందజేశారు.

నేటి నుంచి కైట్ ఫెస్టివల్

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నేటి నుంచి 15 వరకు 6వ ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్-2024 జరుగనున్నది. ఈ నేపథ్యంలో ఆ రూట్లలో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణాలు సాగించాలని నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ సూచించారు. తివోలి క్రాస్ రోడ్డు నుంచి ప్లాజా ఎక్స్ రోడ్డు వరకు రహదారిని మూసేసి, ట్రాఫిక్‌ను ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మళ్లిస్తున్నట్లు తెలిపారు.

'ఐ లవ్ హైదరాబాద్ మెట్రో'

అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఐ లవ్ హైదరాబాద్ మెట్రో' బోర్డును శుక్రవారం ఎల్ అండ్ టీ మెట్రో సీఎండీ కేవీబీరెడ్డి ప్రారంభించారు.నగర వాసులు మెట్రో రైలు ప్రయాణాన్ని ఎంతో ఆస్వాదిస్తున్నారని ఆయన చెప్పారు.

-సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ)

ఆ జీవోను రద్దు చేయొద్దు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 12: ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను రద్దు చేయవద్దని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులను వెంటనే శిక్షణకు పంపించాలని, జీవో 46ను రద్దు చేయకుండా యధావిధిగా కొనసాగించాలని కోరారు. జీవోను రద్దు చేయాలని కొందరు కావాలని రాద్ధాంతం చేస్తూ కోర్టుకు వెళ్తున్నారని ఆరోపించారు.

విద్యార్థులను వేధించిన ప్రొఫెసర్ తొలగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 12: ఉస్మానియా యూనివర్సిటీ ఎకానమిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ నారాయణను పరిశోధన బాధ్యతల నుంచి తప్పిస్తూ ఓయూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సోషల్ సైన్సెస్ డీన్ బాధ్యతలను స్వీకరించాలని ఆదేశించారు. తనకు అన్ని అర్హతలు ఉన్నా.. సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ ఇవ్వలేదనే అక్కసుతో ప్రొఫెసర్ నారాయణ పరిశోధక విద్యార్థులను ఇబ్బందికి గురిచేశారు. పలువురు విద్యార్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి.. ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకున్నారు.